బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 19 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

యాదాద్రి హుండీ లెక్కింపు

బలగం టీవి, యాదాద్రి

యాదగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి భారీగా హుండీ ఆదాయం వచ్చింది. బుధవారం కొండకింద శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి హుండీ ఆదాయం రూ.2,98,48,233లు వచ్చినట్లు చెప్పారు. శ్రీ స్వామి వారి హుండీలో మిశ్రమ బంగారము- (205 గ్రాములు), మిశ్రమవెండి- (5.710గ్రాములు), అమెరికా - 1261 డాలర్లు, ఆస్ట్రేలియా 125 డాలర్లు, ఇంగ్లాండ్ - 65 పౌండ్స్, యూఏఈ - 210 దిరమ్స్, నేపాల్ - 730 రుపీస్, సౌదీ అరేబియన్ - 537 రియల్, సింగపూర్ - 60 డాలర్స్, కతర్ - 3 రియల్, ఒమన్ -100 బైస, శ్రీలంక - 1000 రూపీస్, కెనడా - 60 డాలర్స్, యూరోప్ - 125 యూరో, థాయిలాండ్ - 20 భట్, రష్యా - 50 రూబెల్, ఒమన్ - 1 రియల్, మలేసియా -22 రింగిట్స్ వచ్చాయని తెలిపారు.

తెలంగాణలో ఎంస్ఎంఈలు బలపడాలి

- పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని అందిస్తాం
- తెలంగాణలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేకంగా MSME Policy-2024
- సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణలో ఎంఎస్ఎంఈలు బలపడాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ మాదాపూర్ శిల్పకళా వేదికలో కొత్త ఎంస్ఎంఈ పాలసీ-2024 ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక పురోభివృద్ధి సాధించడానికి పరిశ్రమలు రాణించాలి. అందుకు ప్రజా ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుంది. ఒక పాలసీ లేకుండా ఏ రంగం కూడా అభివృద్ధి సాధించలేదు. అందుకే తెలంగాణలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేకంగా MSME Policy-2024 తీసుకొచ్చాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

ఎంఎస్ఎంఈలు బలపడితే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అందుకు ప్రజా ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఒక ట్రిలియన్ ఎకానమీ సాధించాలన్న లక్ష్య సాధనలో మీరంతా భాగస్వామిగా ఉండాలని ఎంఎస్ఎంఈలకు పిలుపునిచ్చారు. తెలంగాణ బడ్జెట్ 3 లక్షల కోట్ల నుంచి 2028 నాటికి 7 లక్షల కోట్లకు చేరుతుందని విశ్వసిస్తున్నానని, అందుకు ఎంఎస్ఎంఈ సహకారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చెప్పారు.

దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన కృషిని ఎవరూ మరువలేరని అన్నారు. విధానపరమైన రూపకల్పనలు లేకుండా రాష్ట్రంలో అభివృద్ధి చెందదని తెలిపారు. ప్రభుత్వం విధానాలను కొనసాగించినప్పుడే రాష్ట్రం డెవలప్ అవుతుందని పేర్కొన్నారు. పరిశ్రమలకు గత ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీలను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. పాలకులు మారినా .. విధానాలు మాత్రం కొనసాగుతూనే ఉంటాయని అన్నారు

చంద్రబాబు తెచ్చిన ఐటి నీ..అంతకంటే ఎక్కువ వేగంగా వైఎస్ అభివృద్ధి చేశారు కాబట్టే.. ఇంత అభివృద్ధి చెందిందని తెలిపారు. కొవిడ్ కాలం లో మూడు వ్యాక్సిన్ లు ఇక్కడే తయారు అయ్యాయని గుర్తు చేశారు.. తెలంగాణకు ఐటి నీ తెచ్చింది..అభివృద్ధి చేసింది కాంగ్రెస్ అన్నారు. పరిపాలన విషయంలో మాకు ఎలాంటి భేషజాలు లీవ్ అన్నారు. మంచి పని కొనసాగిస్తామని,.. విఘాతం కలిగించే అంశాలు ఉంటే తొలగిస్తామని అన్నారు.బాగా చదువుకుని విద్యార్థులు సర్టిఫికెట్లు సంపాదిస్తున్నారని, కానీ ఉద్యోగం కి వచ్చేసరికి సర్టిఫికెట్లు అక్కరకు రావడం లేదన్నారు. స్కిల్ ఎంప్లాయి రావడం లేదని పారిశ్రామిక వేత్తలు అడుగుతున్నారన్నారు. అందుకే ఐటిఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ కింద్రాలు గా మార్చ బోతున్నం అన్నారు. రేపు పారిశ్రామిక వేత్తలతో ఆనంద్ మహేంద్ర సమావేశం ఉందని అంటూ, . స్కిల్ యూనివర్సిటీ కార్పస్ ఫండ్ క్రియేట్ చేస్తారన్నారు. ఇందులో రాజకీయ ప్రయోజనం ఏం లేదన్నారు.

రైతులకు రుణమాఫీ చేశామని,. అయిన రైతులు బాధలు తప్పడం లేదని రేవంత్ అన్నారు. సమస్య ఏంటంటే.. కుటుంబం అంతా వ్యవసాయం మీదనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. అగ్రికల్చర్ ఇజ్ అవర్ కల్చర్ అన్నారు. అయితే కుటుంబంలో ఒకరిద్దరు వ్యవసాయం చేయండి.. మిగిలిన ఒకరిద్దరు నైపుణ్యం పెంచుకుని పరిశ్రమలు పెట్టాలని కోరారు. ఒకప్పుడు కృష్ణా జిల్లాల్లో ఎకరం అమ్మితే తెలంగాణలో పది ఎకరాలు వచ్చేదన్నారు. కానీ ఇప్పుడు తెలంగాణలో ఎకరం అమ్మితే కృష్ణా జిల్లాలో పది ఎకరాలు వస్తుందన్నారు. చైనా తో పోటీ పడి గొప్పగా ఎదగొచ్చని తెలిపారు. పరిశ్రమలు పెట్టి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పీవీ ప్రధాని అయ్యాకా.. సరళీకృత విధానాలు వచ్చాయన్నారు. ప్రపంచం తో పోటీపడేలా చేశారన్నారు. పీవీ తర్వాత మంథని నుండి ప్రాతినిధ్యం

మిగితా 3వ పేజీలో

జమిలి ఎన్నికలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

- శీతాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం..

బలగం టీవి, న్యూఢిల్లీ

దేశంలో జమిలి ఎన్నికలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికను మంత్రివర్గం ఆమోదించింది.ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన మంత్రివర్గం, రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించింది. అనంతరం ఆమోదం తెలిపినట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

దేశంలోని పెద్ద సంఖ్యలో రాజకీయ పార్టీలు జమిలి ఎన్నికల ప్రతిపాదనకు మద్దతు ఇచ్చాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఉన్నత స్థాయి సమావేశాల్లో ఆయా పార్టీల నేతలు మరోసారి తమ అభిప్రాయాలు చెబుతారని అన్నారు. జమిలి ఎన్నికలను దేశాన్ని బలోపేతం చేసే అంశంగా వర్ణించారు. మరోవైపు, జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును వచ్చే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రజల దృష్టిని మరల్చేందుకే : ఖర్గే

జమిలి ఎన్నికలు ఆచరణాత్మకం కాదని, ఇది ప్రజలు దృష్టి మరల్చేందుకు చేసే బీజేపీ ప్రయత్నమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు వాస్తవ సమస్యల నుంచి దృష్టిని మరల్చడానికి బీజేపీ ఇలాంటి వాటిని తెరపైకి తెస్తోందని ఆరోపించారు. తమ పార్టీ జమిలి ఎన్నికలకు మద్దతు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో జమిలి ఎన్నికలు సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే అవసరమైనప్పుడు ఎన్నికలు నిర్వహించాలని వ్యాఖ్యానించారు ఖర్గే.

2050 స్టాఫ్ నర్సుల ఉద్యోగాలు

- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

బలగం టీవి, హైదరాబాద్

నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జాబ్ కేలండర్ ప్రకారం ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 2050 స్టాఫ్ నర్సుల ఉద్యోగాల భర్తీకి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ నోటిఫికేషన్‌లో భాగంగా రాష్ట్ర కుటుంబ సంక్షేమం, మెడికల్ డైరెక్టర్ విద్యలో 1576 పోస్టులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో 332 పోస్టులు, ఆయూష్‌లో 61, ఇనిస్ట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ లో 1, ఎంఎన్‌జే ఇనిస్ట్యూట్ ఆఫ్ అంకాలజీ, రీజినల్ క్యాన్సర్ కేంద్రంలో 80 పోస్టులతో మొత్తం 2050 ఖాళీలను భర్తీ చేయనున్నారు.

అదే సమయంలో రానున్న రోజుల్లో ఖాళీలు మరిన్ని పెరిగితే వాటిని జోడించడం లేదా తగ్గిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్ లో 28.9.2024 నుండి ప్రారంభంకానుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించేందుకు అక్టోబరు 14 సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇచ్చారు.

దరఖాస్తు దారులు తమ దరఖాస్తులను ఎడిట్ చేసుకునేందుకు అక్టోబరు 16న ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 వరకు సమయం ఇచ్చారు. ఖాళీల భర్తీకి నవంబరు 17న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో పరీక్షను నిర్వహించనున్నారు. 100 పాయింట్ల ప్రాతిపదికన రిక్రూట్ మెంట్ డ్రైవ్‌ను చేపడతామని వెల్లడించారు.ఇందులో 80 పాయింట్లు రాత పరీక్షలో పొందాలని, మరో 20 మార్కుల వెయిటీజీ రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కార్యక్రమాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆరు నెలలుగా పనిచేస్తుంటే 2.5 పాయింట్లు ఇవ్వనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

బీఎస్సీ నర్సింగ్ లేదా జనరల్ నర్సింగ్- మిడ్‌వైఫరీ జీఎన్ఎం అర్హతలు ఉన్న అభ్యర్థులు ఈ పోసటులకు అర్హులని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2,050 నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల తెలంగాణ నర్సుల అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

కేసీఆర్ హయాంలో ఎంఎస్ఎంఈల అభివృద్ధి

- ఎంఎస్ఎంఈ పాలసీలో అధికారికంగా ఒప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- టీఎస్ఐపాస్, పరిశ్రమలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం కారణంగానే మెరుగైన ఫలితాలు.
- కేసీఆర్ చరిత్ర చెరిపేస్తే చెరిగిపోయేది కాదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

పదేళ్ల కేసీఆర్ పరిపాలనలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం అభివృద్ధిలో పరుగులు పెట్టిందని కేటీఆర్ చెప్పారు. ఇది తాను చెబుతున్న లెక్క కాదని స్వయంగా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారికంగా లెక్కలతో సహా వివరించిందన్నారు. కేసీఆర్ పై బురద చల్లాలని తప్పుడు ఆరోపణలు చేసినప్పటికీ లెక్కలు మాత్రం అబద్దాలు చెప్పావని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తక్కువ చేసి చూపాలని ఎంత ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన ఈరోజు విడుదలైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాలసీలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రస్తావించిన అంశాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ గారి హయాంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టిందనటానికి కాంగ్రెస్ చెప్పిన లెక్కలే నిదర్శనమన్నారు.

గత పదేళ్లలో ఎంఎస్ఎంఈల వృద్ధి రేటు 11 శాతం నుంచి 15 శాతం ఉందని ప్రభుత్వమే ఒప్పుకుందని కేటీఆర్ చెప్పారు. 2018-2023 మధ్యలో టీఎస్ఐపాస్ ద్వారా పెరిగిన సగటు పెట్టుబడులు 115 శాతం ఉన్నాయి. జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటాలో 10 శాతం వృద్ధి చెందింది. ఏటా ఎంఎస్ఎంఈల సంఖ్య 15 శాతం పెరిగింది. ఎంఎస్ఎంఈల కారణంగా ఉపాధి 20 శాతం పెరిగింది. ఎంఎస్ఎంఈల్లో ఎస్సీ, ఎస్టీ మహిళలు 30 శాతం ఉద్యోగాలు పొందారు. 2020-2023 మధ్యలో అతి తక్కువ ఎంఎస్ఎంఈలు మూసివేయబడ్డ రాష్ట్రం తెలంగాణ. ఇవి బీఆర్ఎస్ చెబుతున్న లెక్కలు కాదని...కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన లెక్కనేనని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ఐపాస్ వంటి ప్రగతిశీల విధానాలు, చిన్న పరిశ్రమలకు ఇచ్చిన ప్రోత్సాహకాలతోనే ఈ అద్భుత ప్రగతి సాధ్యమైందన్నారు. కేసీఆర్ గారి తక్కువ చేయాలనుకొని కురచ బుద్ధితో విమర్శలు చేసినంతా మాత్రాన నిజాలు దాగవని అన్నారు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అన్నది ఎంత నిజమో.. కేసీఆర్ గారు తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాడన్నది అంతే నిజమని కేటీఆర్ అన్నారు. ఇదే విషయాన్ని రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వమో ఒప్పుకోకతప్పదని చెప్పారు.

20 నుంచి వర్షాలు..

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 20 నుంచి 22 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. సెప్టెంబర్ 20వ తేదీ నుంచి పలు జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ములుగు, కొత్తగూడెం, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. ఇక సెప్టెంబర్ 21న రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తె లిపింది. అదేవిధంగా.. సెప్టెంబర్ 22న పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

నవంబర్ 10లోగా బీసీ గణన పూర్తి చేయాలి..

- కాంగ్రెస్ సర్కారుకు కేటీఆర్ డెడ్‌లైన్..

బలగం టీవి, హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డెడ్‌లైన్ విధించారు. నవంబర్ 10వ తేదీలోగా బీసీ గణన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం బీఆర్ఎస్ బీసీ నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ పేరుతో చేసిన మోసంపై పార్టీకి సంబంధించిన బీసీ నేతలతో చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అమలు జరిగే వరకు కాంగ్రెస్ సర్కారును నిలదీస్తామని స్పష్టం చేశారు. 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనన్నారు. వెంటనే సమగ్ర కులగణన ప్రారంభించి.. నవంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయకుంటే బీసీల తరపున ఎలా ముందుకువెళ్తామన్నదానిపై కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అవసరమైతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు. బీసీలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి రూ.8వేలకోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టారని విమర్శించారు.

బీసీ సబ్‌ప్లాన్ తీసుకురావాలన్నారు. రూ.25వేల నుంచి రూ.35వేలకోట్లు పెట్టాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల వాటా పెంచాలన్నారు. ఎంబీసీలకు మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామన్నారని.. హామీ ఇచ్చిన మేరకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేబినెట్‌లో ఇద్దరు మాత్రమే బీసీ మంత్రులు ఉన్నారన్నారు. నేతన్నలు సంక్షోభంలో ఉన్నారని.. చేపపిల్లల పంపిణీ ఆపేసి గంగపుత్రుల పొట్టగొడుతున్నదని ధ్వజమెత్తారు. బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. బీసీ డిక్లరేషన్‌లోనే దాదాపు దాదాపు 70 హామీలు ఉన్నాయని.. బీసీల కోసం బీఆర్ఎస్ కదిలిందన్నారు. రాష్ట్రంలోని బలహీన వర్గాలకు పెద్దదిక్కుగా బీఆర్ఎస్ ఉంటుందన్నారు. జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలన్నారు. వచ్చే ఎన్నికల కోసం దేశంలోని అన్ని ప్రభుత్వాలను రద్దు చేస్తారా? బీఆర్ఎస్ నేత ప్రశ్నించారు. ఈ జమిలీ ఎన్నికలపై పార్టీ నేతలమంతా కూర్చొని చర్చించి నిర్ణయిస్తామన్నారు.

జమ్ముకశ్మీర్‌లో 58.85 శాతం పోలింగ్

బలగం టీవి, జమ్మూ

కంద్ర పాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్‌లోబుధవారం జరిగిన తొలి విడత పోలింగ్‌లో 58.85 శాతం ఓటింగ్ నమోదైంది. కిష్ట్వార్‌లో అత్యధికం, పుల్వామాలో అత్యల్పంగా పోలింగ్ జరిగింది. కశ్మీర్‌లోని నాలుగు జిల్లాలైన అనంత్‌నాగ్, పుల్వామా, షోపియాన్, కుల్గామ్‌లోని 16 స్థానాలు, జమ్ములోని మూడు జిల్లాలైన దోడా, రాంబన్, కిష్ట్వార్‌లోని 8 స్థానాల్లో బుధవారం తొలి దశ కింద పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. తొలి దశలో 58.85 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. కిష్ట్వార్ జిల్లాలో అత్యధికం, పుల్వామాలో అత్యల్పంగా ఓటింగ్ నమోదైనట్లు తెలిపింది. సాయంత్రం 5 గంటల వరకు జిల్లాల వారీగా ఓటింగ్ శాతాన్ని ఈసీ పేర్కొంది. కిష్ట్వార్‌లో 77.23 శాతం, దోడాలో 69.33 శాతం, రాంబన్‌లో 67.71 శాతం, కుల్గామ్‌లో 59.62 శాతం, అనంతనాగ్‌లో 54.17శాతం, షోపియాన్‌లో 53.64 శాతం, పుల్వామాలో 43.87 శాతం ఓటింగ్ నమోదైనట్లు వివరించింది.

మిగితా 3వ పేజీలో

డీఎస్పీగా నిఖత్ జరీన్

- డీజీపీకి జాయినింగ్ లేఖ అందజేత

బలగం టీవి, హైదరాబాద్

భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె బుధవారం రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్‌ను కలిసి తన జాయినింగ్ లేఖను అందజేశారు. నిఖత్ జరీన్‌ను డిఎస్‌పిగా నియమిస్తూ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రపంచ బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ అసాధారణ ప్రతిభతో రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఇనుమడింప చేశారు. ఆమె ప్రతిభకు గుర్తింపుగా తెలంగాణ ప్రభుత్వం ఈ పదవిని అప్పగించింది.

సింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు

- అవినీతి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి
- అన్ ఫిట్ చేయిస్తామని అక్రమాలకు పాల్పడే వారి సమాచారం ఇస్తే రూ.10వేల నజరానా
- నాణ్యత పాటించని అధికారులు, కాంట్రాక్టర్లు, ఏజెన్సీలపై కూడా కఠిన చర్యలు
- విజిలెన్స్ విభాగంపై సమీక్షలో సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ స్పష్టీకరణ

బలగం టీవి, హైదరాబాద్

ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆస్తులు, క్వార్టర్లను పరిరక్షించడం అందరి బాధ్యత అని సీఎండీ ఎన్.బలరామ్ చెప్పారు. దీన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్క ఉద్యోగి కృషి చేయాలన్నారు. సింగరేణి ఆస్తులు, క్వార్టర్ల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి బుధవారం విజిలెన్స్ శాఖపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ పూర్తి పారదర్శకంగా, అవినీతి రహితంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ

మిగితా 3వ పేజీలో

వినాయకుడి ఊరేగింపులో విషాదం..

- ఓ యువకుడు మృతి

బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో వినాయకుల ఊరేగింపులో కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ప్రత్యక్ష సాక్షుల వివరాలు ప్రకారం దుమాల గ్రామానికి చెందిన న్యాలకొండ రాకేష్ (18) అనే యువకుడు తోటి మిత్రుల వినాయకుడి ఊరేగింపు కోసం ట్రాక్టర్లో డీజిల్ పోసేందుకు కి తీస్తుండగా ఇంజన్ స్టార్ట్ కాగా ట్రాక్టర్ పెద్ద టైరు అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన తోటి మిత్రులు వెంటనే హుటాహుటిన ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చి సుమారు 25 నిమిషాలు నలుగురు వైద్యులు సిపిఆర్ చేసిన ఫలితం లేకపోగా ఆ యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకొని బోరన విలపించారు. ఎస్సై రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుని తండ్రి రఘుపతి బ్రతుకుతెరువు కోసం గల్ఫ్ దేశాల్లో ఉండగా తల్లి పద్మ ఇంటి వద్దనే ఉంటుంది. మృతునికి ఓ సోదరి ఉన్నది. మృతుడు తల్లిదండ్రులకు ఒకానొక కావడంతో గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి.తోటి మిత్రుడు కళ్ళముందే మృతి చెందడంతో మిత్రులు కన్నీటి పర్వతమయ్యారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందుతురాలికి ఏడాది జైలు శిక్ష....

బలగం టీవీ , సిరిసిల్ల :

వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందుతురాలికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి రాధిక జైష్వాల్ తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలం జంగారెడ్డి పల్లెకు చెందిన వొల్లాల మల్లయ్య వద్ద కరీంనగర్ కు చెందిన కిన్నెర మల్లవ్వ కి 2017 సంవత్సరంలో రూ.4,30,000 అప్పుగా తీసుకొని, తిరిగి మల్లయ్య కూతురు పెళ్లికి అప్పు తిరిగి ఇస్తానని స్టాంప్ పేపర్ పైన రాసి ఇచ్చిందని అన్నారు.2018 సంవత్సరంలో మల్లయ్య తన కూతురి పెళ్లి ఖాయం కావడంతో మల్లవ్వను డబ్బులు అడుగగా , మల్లవ్వ డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు బేధరింపులకు పాల్పడగా కూతురు పెళ్లి ఎక్కడ ఆగిపోతుందని తీవ్ర మనోవేదనకి గురైన మల్లయ్య పురుగుల మందు తాగి చనిపోయాడు అని అన్నారు. కేసు నమోదు చేసిన ఇళ్లంతకుంట పోలీసులు మల్లవ్వని రిమాండ్ కు తరలించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు అని అన్నారు. సీఎంఎస్ ఎస్ ఐ రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నవీన్, సిఎంఎస్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ లు కోర్టులో 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీప్రసాద్ వాదించాగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందుతురాలు మల్లవ్వకి ఏడాది జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న కరీంనగర్ కు చెందిన కిన్నెర మల్లవ్వ కు శిక్ష పడటంలో కిలంకంగా వ్యవహరించిన పి పి లక్ష్మీప్రసాద్,కోర్టు కానిస్టేబుల్ నవీన్, సిఎంఎస్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ లను ఎస్పీ అఖిల్ మహాజన్ గారు అభినందించారు.

జానీ మాస్టర్‌పై పోక్సో కేసు నమోదు..!

బలగం టీవీ , హైదరాబాద్

డ్యాన్సర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో కొరియోగ్రఫర్ జానీ మాస్టర్ పై ఇప్పటికే పోలీసులు ఐపీసీ సెక్షన్ 376, 506, 323(2) కింద కేసులు నమోదు చేశారని తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా నార్సింగి పోలీసులు బాధితురాలి నుంచి ఇప్పటికే స్టేట్ మెంట్ కూడా తీసుకున్నారు. మరోవైపు పోలీసులు జానీ మాస్టర్ కోసం గాలింపు కూడా ముమ్మరం చేశారు.తాజాగా జానీమాస్టర్ లడఖ్‌లో ఉన్నట్టు పోలీసులకు సమాచారమందడంతో ప్రత్యేక పోలీస్ బృందాలు లడఖ్‌కు బయలుదేరినట్టు తెలుస్తోంది. జానీ మాస్టర్‌ను పోలీసులు ఏ క్షణంలోనైనా అరెస్ట్ చేయొచ్చని సమాచారం. కాగా ఈ కేసులో బాధితురాలికి వైద్య పరీక్షలు కూడా నిర్వహిం చారు. ఇప్పటికే నార్సింగి పోలీసులు బాధితురాలి ఇంట్లోనే విచారించి వివరాలు సేకరించారు.

పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో బాధితురాలు సంచలన విషయాలు బయట పెట్టింది. జానీ మాస్టర్ తనపై లైంగికదాడి చేసి దాడి చేశాడని బాధితురాలు పోలీసులకు తెలిపింది. షఉటింగ్ టైంలో క్యారవాన్‌లో బలవంతం చేశాడు. సెక్స్ కోరిక తీర్చమని తనను ఎంతో వేధించాడని..తన మాట వినకపోతే ఆఫర్లు రాకుండా చేస్తానని బెదిరించాడని, పెళ్లి చేసుకోవాలని జానీ మాస్టర్ తనపై ఒత్తిడి చేశాడని బాధితురాలు తన స్టేట్‌మెంట్‌లో పేర్కొంది.

జానీ మాస్టర్ కేసుపై కరాటే కళ్యాణి సంచలన వ్యాఖ్యలు

బలగం టీవీ , హైదరాబాద్

లైంగిక వేధింపుల ఆరోపణల్లో కొరియోగ్రఫర్ జానీ మాస్టర్ పై నార్సింగి పోలీసులు ఐపీసీ సెక్షన్ 376, 506, 323(2) కింద కేసులు నమోదు చేశారని తెలిసిందే. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే బాధితురాలి నుంచి ఇప్పటికే స్టేట్ మెంట్ తీసుకున్న పోలీసులు జానీ మాస్టర్ కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ వ్యవహారంపై నటి కరాటే కళ్యాణి స్పందించింది. ఇది లవ్ జిహాద్ కేసు అన్న ఆమె లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా ఫైట్ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. లైంగిక వేధింపుల కేసులో తప్పు రుజువైతే జానీమాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని కరాటే కళ్యాణి డిమాండ్ చేసింది. జానీమాస్టర్ మతం మారితే పెళ్లి చేసుకుంటాననడమేంటని ప్రశ్నించిన కరాటే కళ్యాణి.. బాధితురాలికి అందరూ అండగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ఈ కేసులో తాజాగా బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మరిన్ని ఆధారాలు సేకరించడంలో భాగంగా పోలీసులు ఇవాళ బాధితురాలి ఇంటికి మరోసారి వెళ్లనున్నారని తెలుస్తోంది.

ఇద్దరి గొంతు కోసిన దుండగులు

బలగం టీవీ , హైదరాబాద్

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. గుర్తు తెలియని దుండగులు ఇద్దరు వ్యక్తుల గోంతు కోసి పారిపోయారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన పవన్ కుమార్, సంతోష్ అనే వ్యక్తులు మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లో నివాసముంటున్నారు. రోజువారి కూలీ పనులకు వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నారు.కాగా, బుధవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న పవన్, సంతోష్‌పై గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి పారిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. గాయపడిన వారిలో సంతోష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఓటర్ జాబితా రూపకల్పనలో సహకరించాలి...

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝు..

బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:

గ్రామీణ ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సంపూర్ణ సహకారం అందజేయాలని, ఓటరు జాబితా రూపకల్పనపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మీనీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ తో కలిసి గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పన పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝు సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, ఈ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 13న గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేసి గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించడం జరిగిందని అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న 260 గ్రామ పంచాయతీల పరిధిలోని 2268 వార్డుల్లో మొత్తం 3 లక్షల 46 వేల 220 ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేశామని, ఇందులో గల అభ్యంతరాలు, నూతన ఓటర్ నమోదు దరఖాస్తులను సెప్టెంబర్ 21 లోపు సంబంధిత మండలాల ఎంపీడీఓలకు లిఖిత పూర్వకంగా సమర్పించాలని, సెప్టెంబర్ 26 లోపు అభ్యంతరాలను పరిష్కరించి, సెప్టెంబర్ 28న తుది ఓటర్ జాబితా విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.

ఒక కుటుంబంలోని సభ్యులందరికీ ఒకే వార్డులో ఓట్లు ఉండేలా కార్యాచరణ రూపొందించామని అన్నారు.గ్రామీణ ఓటరు జాబితా పకడ్బందీగా తయారు చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సంపూర్ణ సహకారం అందజేయాలని, ఓటర్ జాబితా రూపకల్పన పై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు.తంగళ్ళపల్లి కేసీఆర్ నగర్ ప్రాంతంలో అధికంగా జనాభా ఓటర్లు ఉన్నందున దానిని ప్రత్యేక గ్రామపంచాయతీ చేసే ప్రతిపాదనను పరిశీలించాలని రాజకీయ పార్టీల పక్షాలు కోరగా, ఇది ప్రభుత్వ పరిధిలోని అంశం అని ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖిమ్యా నాయక్, జిల్లా ఇంఛార్జి పంచాయతీ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, జడ్పీ డీప్యూటీ సీఈఓ గీతా,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

భోజన సదుపాయం ఎలా ఉంది...

- విద్యార్థులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

బలగం టీవీ , సిరిసిల్ల :

భోజన సదుపాయం ఎలా ఉంది,తరగతులు ఎలా బోధిస్తున్నారు విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అడిగి తెలుసుకున్నారు. కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయ ఆవరణం, తరగతి గదులు, సరుకులు నిలువ చేసే గది, కిచెన్, స్టోర్ రూం, తదితర వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అన్ని సబ్జెక్టులలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా పాఠాలు బోధించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్, ప్రిన్సిపాల్ ఆర్ ఎస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

నేడు ఏకలవ్య స్కూల్స్ ను సందర్శించనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్..

- 11 గంటలకు కోనరావుపేట మరిమడ్ల కు...
- 1 గంటకు ఎల్లారెడ్డిపేట మండలం దూమాలకు రాక..

బలగం టీవీ , సిరిసిల్ల :

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం రాజన్న సిరిసిల్లలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించనున్నారు. దేశవ్యాప్తంగా ఎంపీలు, మంత్రులంతా తమ తమ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట మండలం మరిమడ్లలో ఉదయం 11 గంటలకు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను, మధ్యాహ్నం ఒంటి గంటకు ఎల్లారెడ్డిపేటలోని దుమాల మోడల్ స్కూల్ ను సందర్శించనున్నారు. ఆయా పాఠశాలల్లో కొనసాగుతున్న విద్యా బోధనతోపాటు విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులతో మాట్లాడనున్నారు. దీంతోపాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, కల్పించాల్సిన సౌకర్యాలపైనా ఆరా తీయనున్నారు. బోధనలో, సౌకర్యాల కల్పనలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను అగ్రభాగాన నిలపాలనే సంకల్పంతోనే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగానున్న ఏకలవ్య మోడల్ స్కూల్స్ ను సందర్శించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి రాక ప్రాధాన్యతను సంతరించుకుంది.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

బలగం టీవీ , వేములవాడ :

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా రాజన్న ను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కోడె మొక్కు చెల్లించుకున్నారు.విప్ దంపతులకు కళ్యాణమండపం లో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసినారు.ఆలయ ఈఓ వినోద్ రెడ్డి శాలువా కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. వీరి వెంట ఏ ఈ ఓ బి.శ్రీనివాస్, జి.రమేష్ బాబు ,పర్యవేక్షకులు తిరుపతి రావు ఉన్నారు.

ప్రభుత్వ విప్ ఆలయ ఉద్యోగుల సంఘం ఘనసన్మానం..

పభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మ దిన సందర్భంగా రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్ ఏ ఈ ఓ లు బి.శ్రీనివాస్, జి .రమేష్ బాబు లు శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపినారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ 58వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరిపారు ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా దేవాలయంలో ఆది శ్రీనివాస్ పేరిట ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ చిత్రపటం ఎదుట కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు ప్రభుత్వ విప్ ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు ఇంకా సేవలందించాలని ఆకాంక్షించారు.మంచి పదోన్నతితో భవిష్యత్తు కాలంలో ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ నాయకులు,కొండాపురం శ్రీనివాసరెడ్డి పందిర్ల లింగం గౌడ్, వంగ గిరిధర్ రెడ్డి,మర్రి శ్రీనివాసరెడ్డి,మేడిపల్లి దేవానంద్, దేవేందర్ యాదవ్,మల్లారెడ్డి తిరుపతి రెడ్డి,చెన్ని బాబు, రామ్ రెడ్డి,సూడిద రాజేందర్, రాజు నాయక్, పందిర్ల సుధాకర్ గౌడ్, ఏలూరి రాజయ్య, కొత్తపల్లి దేవయ్య, కదిరి శ్రీనివాస్ గౌడ్, ముక్క శంకర్ కొత్తపల్లి నరసింహులు నంది కిషన్ బండారి బాల్ రెడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడలకు రైసింగ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు

బలగం టీవీ , సిరిసిల్ల :

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడాలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రైసింగ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారు.రాజన్న సిరిసిల్ల జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6 న గవర్నమెంట్ కళాశాల మైదానం లో నిర్వహించిన సాఫ్ట్ బాల్ సెలక్షన్ స్ లో రైసింగ్ ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ నుండి రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ క్రీడాలకు బాలికల విభాగం నుండి కమాటం జిగిష (కృష్ణ వేణి స్కూల్), బొల్లి రీత్విక (శ్రీ చైతన్య స్కూల్),బాలుర విభాగం నుండి కంచర్ల నరేంద్ర వర్మ , ఊసకోయాలా అఖిల్ (సాయి శ్రీ కాలేజీ) ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి కి ఎంపిక అయ్యారని అకాడమీ కోచ్ కృష్ణ హరి తెలిపారు. ఈ క్రీడాకారులు ఈ నెల 21,22,23 న సిరిసిల్ల లో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ క్రీడాలో పాల్గొంటారని అకాడమీ కోచ్ సాయి తేజ తెలిపారు. అకాడమీ క్రీడాకారులు వివిధ విద్య సంస్థ లో చదువుతూ ఉదయం, సాయంత్రం సమయాలలో అకాడమీ లో తర్ఫీదు తీసుకొని మంచి ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థుల పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు...

RISING FITNESS & SPORTS ACADEMY

21న ఢిల్లీ కొత్త సీఎం ప్రమాణ స్వీకారం

%

బలగం టీవీ , హైదరాబాద్

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన ఒక వర్తమానంలో కొత్త ముఖ్యమంత్రిగా ఆతిశీ ప్రమాణ స్వీకారానికి తేదీని ఈ నెల 21గా ప్రతిపాదించారు. అర్వింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా మంగళవారం రాజీనామా చేయగా, ఢిల్లీలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వవలసిందిగా ఆతిశీ కోరిన తరువాత ఈ పరిణామం చోటు చేసుకుంది. కేజ్రీవాల్ ఢిల్లీ సిఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా లేఖ ప్రతులను, కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఆతిశీ అవకాశం కోరుతున్న లేఖ ప్రతులను 'ఇండియా టుడే' ప్రత్యేకంగా సంపాదించింది. కేజ్రీవాల్ తన రాజీనామా లేఖను లెఫ్టినెంట్ గవర్నర్‌కు కాకుండా రాష్ట్రపతి ముర్ముకు ఉద్దేశించి రాశారు. అయితే, కేజ్రీవాల్ తన రాజీనామా సమర్పణకు ఎల్‌జి వికె సక్సేనాను స్వయంగా కలవడం గమనార్హం. పదవికి కేజ్రీవాల్ రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు లెఫ్టినెంట్ గవర్నర్ పంపినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

అక్టోబర్‌లో ఉపేంద్ర 'యూఐ'



బలగం టీవీ , హైదరాబాద్

వైవిధ్యమైన కథాంశాలతో విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు కన్నడ హీరో ఉపేంద్ర. ఆయన స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'యూఐ'. జి.మనోహరన్, కేపీ శ్రీకాంత్ నిర్మాతలు. పీరియాడిక్ ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అక్టోబర్‌లో విడుదల చేయబోతున్నారు. బుధవారం ఉపేంద్ర జన్మదినం సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఉపేంద్ర కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందిస్తున్న చిత్రమిదని, ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళుతుందని, నటుడిగా ఉపేంద్ర విశ్వరూపాన్ని చూస్తారని మేకర్స్ తెలిపారు. రీష్మా, నిధి సుబ్బయ్య, మురళీశర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్నందిస్తున్నారు.

తెలంగాణలో ఎంస్ఎంఈలు బలపడాలి

(మొదటి పేజీ తరువాయి)

వహిస్తున్నారు శ్రీధర్ బాబు అన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇవాళ పాలసీ రెడీ చేశారన్నారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక రాయితీలను కొనసాగిస్తామని, పెండింగ్ రాయితీలను కూడా చెల్లిస్తామని ముఖ్యమంత్రి గారు తెలిపారు.

"ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నడిపించాలన్నదే లక్ష్యం. ఈ ప్రభుత్వం ప్రజా పాలనను అందిస్తుంది. పెట్టుబడులు పెట్టండి. ప్రభుత్వ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఈ విషయంలో అందరి సలహాలు, సూచనలు స్వీకరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. దళితులు, గిరిజనులు, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది." అని చెప్పారు. దళిత పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి ఆ వర్గాలకు అవసరమైన భూముల కేటాయింపులు, రాయితీలు, సబ్సిడీలు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధికి అనేక ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని, ఆ కోవలోనే తెలంగాణలో ఫ్యూచర్ సిటీని డిజైన్ చేశామని చెప్పారు. ఓఆర్ఆర్, దానికి సమాంతరంగా రీజినల్ రింగ్ రోడ్డు, ఈ రెండింటి మధ్య రేడియల్ రోడ్లతో పెట్టుబడుల కోసం సమగ్రమైన అభివృద్ధి ప్రణాళికలను రచించినట్టు ముఖ్యమంత్రి గారు వివరించారు.

పెట్టుబడుల కోసం అనేక దేశాలు చైనా ప్లస్ వన్ బాట పట్టాయని, పెట్టుబడులకు ప్రత్యామ్నాయం తెలంగాణ మాత్రమేనని ఈ రాష్ట్రంలో ఉన్న అనుకూల పరిస్థితులను ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు.

జమ్ముకశ్మీర్‌లో 58.85 శాతం పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

కాగా, జమ్ముకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ను 2019 ఆగస్ట్‌లో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే ఆ రాష్ట్రాన్ని జమ్ముకశ్మీర్, లఢక్ కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. డీలిమిటేషన్ కసరత్తు తర్వాత కశ్మీర్‌కు 47, జమ్ముకు 43 అసెంబ్లీ స్థానాలు కేటాయించారు. పదేళ్ల తర్వాత మొత్తం 90 అసెంబ్లీ నియోజక వర్గాలకుగాను తొలి దశలో 24 నియోజక వర్గాల్లో బుధవారం పోలింగ్ నిర్వహించారు.

బీఆర్ఎస్‌కు హైకోర్టులో చుక్కెదరు

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ పార్టీకి చుక్కెదురైంది. నల్గొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అనుమతి లేకుండా నిర్మించిన పార్టీ ఆఫీసును 15 రోజుల్లో కూల్చేయాలని చెప్పింది. పార్టీ నాయకులే కార్యాలయానికి కూల్చివేయాలని.. లేదంటే మున్సిపల్ శాఖ అధికారులు కూల్చేస్తారని హెచ్చరించింది. పార్టీ ఆఫీసును రెగ్యులర్ చేసేలా మున్సిపల్ శాఖకు ఆదేశాలు ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై నేడు విచారణ జరిపిన న్యాయస్థానం.. ఆఫీస్ నిర్మాణం చేయకముందు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి కదా..? అని ప్రశ్నించింది. పార్టీ ఆఫీసు నిర్మించిన తర్వాత ఎలా అనుమతి ఇస్తారని పిటిషనర్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం 15 రోజుల్లో పార్టీ కార్యాలయాన్ని కూల్చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

బీఆర్ఎస్ సాధించిన విజయాలను తమ ఘనతగా చెప్పుకోవడం శోచనీయం

- మాజీ మంత్రి హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్

కేసీఆర్ పాలనలో ఎంఎస్ఎంఈలు ఎంతో అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలిచాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈలు మూతపడ్డా.. రాష్ట్రంలో అనుసరించిన టీఎస్ఐపాస్ లాంటి విధానాలు ఎంఎస్ఎంఈలను దృఢంగా నిలిపాయని బుధవారం ఎక్స్ వేదికగా తెలిపారు. పెట్టుబడుల్లో 115 శాతం పెరుగుదలతో దేశంలో అగ్రగామిగా నిలవడమే కాక.. ఉద్యోగాల కల్పనలో 20శాతం వృద్ధిరేటు సాధించిందని చెప్పారు. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు 30శాతం ఉద్యోగావకాశాలు లభించాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బీఆర్ఎస్ పాలనలో సాధించిన ఘనతను వారి ఖాతాలో వేసుకుంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఎంఎస్ఎంఈ అభివృద్ధికి తాము చేసిన కృషి ఏమిటో, భవిష్యత్తు కార్యాచరణ ఏమిటో చెప్పకుండా గత ప్రభుత్వ విజయాలతో కాలం గడపడం శోచనీయమని మండిపడ్డారు.

సింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది అక్రమార్కులు అమాయకులైన కార్మికుల్ని మోసం చేస్తున్నారని తెలుస్తోందని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ హెచ్చరించారు. ఇప్పటికే మెడికల్ బోర్డు పేరిట అక్రమాలకు తావు లేకుండా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ, నేర దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయించడం జరిగిందన్నారు..

ఇటీవల మెడికల్ బోర్డు ప్రక్రియలో దళారులపై సీఐడీ నివేదిక ఇచ్చిన తర్వాత, దీని ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే మెడికల్ బోర్డు సహా కంపెనీకి నష్టం కలిగించే పనులు చేస్తున్న ఉద్యోగులు, ఇతరుల సమాచారాన్ని కంపెనీ విజిలెన్స్ విభాగానికి 9491144104 నెంబరులో లేదా vig@scclmines.com మెయిల్ కు ఆధారాలతో పంపించాలని సూచించారు. అక్రమార్కులపై కచ్చితమైన సమాచారాన్ని ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు వారికి రూ.10 వేల ప్రోత్సాహక బహుమతిని కూడా ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

సింగరేణి సంస్థలో అవినీతి అక్రమాలకు స్థానం లేదని, అక్రమార్కులపై విజిలెన్స్ శాఖ గట్టి నిఘాను ఉంచాలని, కార్మికులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అవినీతిని అరికట్టడంలో సహకరించాలన్నారు. కారుణ్య ఉద్యోగ నియామక ప్రక్రియలో సింగరేణి ఉద్యోగులు అవినీతికి పాల్పడినట్లు తేలితే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, ఇతరులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అందజేసి అన్ ఫిట్ అవుతున్న వారికి కంపెనీ ద్వారా లభించే టర్మినల్ బెనిఫిట్స్ ను నిలిపివేయడం జరుగుతుందని హెచ్చరించారు. అనారోగ్య కారణాలతో బాధపడే వారి కోసమే కారుణ్య నియామక ప్రక్రియను అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. సింగరేణిలో ఏటా కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టు పనులు జరుగుతున్నాయి, వీటి నాణ్యతపైన కూడా విజిలెన్స్ నిఘాను పెట్టాలని సీఎండీ ఆదేశించారు. కాంట్రాక్టు పనుల్లో నాణ్యత పాటించని పక్షంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు.

సింగరేణి సంస్థ చరిత్రలోనే తొలిసారిగా కంప్యూటర్ ఆధారిత ఉద్యోగ నియామక పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఇందులో 272 ఎక్స్ టర్నల్ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును కూడా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే మిగిలిన 327 పోస్టుల ఫలితాలను విడుదల చేయనున్నట్లు చెప్పారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని రైతుల ధర్నా

బలగం టీవి, హైదరాబాద్

ట్రిపుల్ ఆం భూ సేకరణపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలైన్‌మెంట్ మార్చాలని, లేదంటే భూమికి బదులు భూమినైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకుయాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్డీవో శేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చి వ్యవసాయేతర భూముల్లో నుంచి ట్రిపుల్ ఆర్ రోడ్ వెళ్లే విధంగా డిజైన్ మార్చాలని రైతులు కోరారు.దశాబ్దాలుగా వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నామని, రీజినల్ రింగ్ రోడ్డుకు తమ భూమి తీసుకుంటే రోడ్డున పడుతామని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని లేదా బహిరంగ మార్కెట్లో పలుకుతున్న ధర అనుసరించి నష్టపరిహారం ఇవ్వాలని, లేకుంటే భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై తక్షణమే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బాధిత రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు

- సీబీఐ

బలగం టీవి, హైదరాబాద్

ఆర్జీ కర్ వైద్యకళాశాలకు చెందిన ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసును విచారిస్తున్న సీబీఐ పలు కీలక విషయాలను వెల్లడించింది. నిందితుడు సంజయ్ రాయ్‌కు చెందిన దుస్తులను స్వాధీనం చేసుకోవడంలో కోల్‌కతా పోలీసులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించింది. హత్యాచారంలో నిందితుడి ప్రమేయం ఉందని తెలిసినా, అతనికి సంబంధించిన దుస్తులు, వస్తువులను ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత స్వాధీనం చేసుకున్నారని తెలిపింది. ఘటన జరిగిన రోజే దుస్తులు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకొని ఉంటే బలమైన సాక్ష్యాధారాలు దొరికే అవకాశం ఉండేదని పేర్కొంది. అప్పుడు కేసులో కొంత వరకు పురోగతి కనిపించేదని వెల్లడించింది.

ఆర్జీ కర్ వైద్యకళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ అభిజిత్ మోండల్‌లు సాక్ష్యాలను చెరిపివే సేందుకు ప్రయత్నించారని సీబీఐ అధికారులు ఆరోపిస్తున్నారు. సందీప్ ఘోష్, అభిజిత్ మోండల్‌లకు నిందితుడితో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో సీబీఐ విచారణ చేస్తోంది.

టెస్ట్ సమరానికి సై

- నేడే ఇండియా, బంగ్లాదేశ్ తొలి టెస్ట్ ప్రారంభం..
- టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్ లక్ష్యంగా భారత్
- పాకిస్థాన్‌ను ఓడించిన ఉత్సాహంలో బంగ్లాదేశ్

బలగం టీవి, చెన్నై

టీమిండియా స్వదేశంలో మరో టెస్ట్ సిరీస్ కు సిద్ధమైంది.బంగ్లాదేశ్ తో రెండు టెస్టుల సిరీస్ ఆడబోతోంది. ఈ మేరకు తొలి టెస్టు గురువారం (సెప్టెంబర్ 19) చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ప్రారంభం కానుంది.

టీమిండియా చివరిసారి మార్చిలో ఇంగ్లండ్ తో టెస్ట్ సిరీస్ ఆడింది. ఐదు టెస్టుల ఆ సిరీస్ ను 4-1తో గెలుచుకుంది. ఇప్పుడు ఆరు నెలల తర్వాత మళ్లీ ఐదు రోజుల క్రికెట్ ఆడనుంది. ఇందులో భాగంగా స్వదేశంలో మొదట బంగ్లాదేశ్ తో రెండు టెస్టులు, తర్వాత న్యూజిలాండ్ తో మూడు టెస్టులు, ఏడాది చివర్లో ఆస్ట్రేలియాలో ఐదు టెస్టులు ఆడుతుంది.

తొలి టెస్టు కోసం 16 మందితో జట్టుని బీసీసీఐ ఇటీవల ప్రకటించింది. టీమ్‌లోకి రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), రవిచంద్రన్ అశ్విన్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, యశ్ దయాల్ ఎంపికయ్యారు.

అటు భారత్‌తో రెండు టెస్టుల సిరీస్ కోసం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు 16 మందితో కూడిన జట్టుని ప్రకటించింది. టీమ్‌లో నజ్ముల్ హుస్సేన్ శాంటో (కెప్టెన్), మహ్మదుల్లా హసన్ జాయ్, జాకీర్ హసన్, షకీబ్ అల్ హసన్, లిట్టన్ దాస్ (వికెట్ కీపర్), జాకర్ అలీ అనిక్ (వికెట్ కీపర్), మెహిదీ హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లాం, షాద్మన్ ఇస్లాం, మొమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్, నయీమ్ హసన్, నహీద్ రాణా, హసన్ మహమూద్, తస్కిన్ అహ్మద్, సయ్యద్ ఖలీద్ అహ్మద్ ఎంపికయ్యారు.

ండియా, బంగ్లాదేశ్ సిరీస్ లైవ్ స్ట్రీమింగ్

ఇండియా, బంగ్లాదేశ్ టెస్ట్ సిరీస్ లైవ్ స్ట్రీమింగ్ హక్కులను స్పోర్ట్స్ 18, జియో సినిమా ఓటీటీ సొంతం చేసుకున్నాయి. టీవీలో అయితే స్పోర్ట్స్ 18, కలర్స్ సినీప్లెక్స్ ఛానెల్స్ లో ఈ మ్యాచ్ లైవ్ చూడొచ్చు.ఇక ఆన్‌లైన్లో అయితే జియో సినిమాలో ఫ్రీగా లైవ్ స్ట్రీమింగ్ ఉంటుంది. గురువారం (సెప్టెంబర్ 19) ఉదయం 9.30 గంటలకు తొలి టెస్టు ప్రారంభం కానుంది. 2024-25 ఇండియా హోమ్ సీజన్ చెన్నైలో ప్రారంభం కానుంది.

టీమ్‌ఇండియా బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది

- భారత హెడ్ కోచ్ గంభీర్

బలగం టీవి, చెన్నై

ప్రపంచంలోని అత్యుత్తమ స్పిన్ యూనిట్‌నైనా భారత బ్యాటర్లు సమర్థవంతంగా ఎదుర్కోగలరని, భారత జట్టు బ్యాటింగ్ లైనప్ చాలా బలంగా ఉందని టీమ్ ఇండియా హెచ్ కోచ్ గౌతమ్ గంభీర్ ధీమా వ్యక్తం చేశాడు. బంగ్లాదేశ్‌తో గురువారం నుంచి జరగబోయే మొదటి టెస్టు నేపథ్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గంభీర్ మాట్లాడారు.

ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో టీమ్ ఇండియా బరిలోకి దిగే అవకాశం ఉందని చెప్పాడు. "భారత్ జట్టు ఒకప్పుడు బ్యాటర్లపైనే ఆధారపడేది. కానీ బుమ్రా, షమీ, అశ్విన్, జడేజా వంటి బౌలర్లు ఆ ముద్రను పూర్తిగా చెరిపేశారు. బుమ్రా ప్రస్తుతం ప్రపంచంలోని అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్. అతడు మ్యాచ్‌ను ఏ దశలోనైనా టీమ్ ఇండియా వైపు తిప్పేయగల సమర్థుడు. అశ్విన్, జడేజాల స్పిన్ త్రయం ఒకేసారి అందుబాటులో ఉండడం టీమ్ ఇండియాకు కలిసి వస్తుంది. పంత్ విధ్వంసక బ్యాటర్. మంచి వికెట్ కీపర్ కూడా. అందుకే పంత్ తుది జట్టులో ఉండాలి. అలాగే ఓపెనర్ యశస్వీ కూడా పంత్‌కు షాడో వికెట్ కీపర్‌గా ఉంటాడు. బంగ్లాదేశ్‌తో జరిగే మొదటి టెస్టులో ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్ వంటి యువ ఆటగాళ్లకు అవకాశం దక్కకపోవచ్చు. వారిద్దరూ టెస్టు జట్టులో స్థానం కోసం మరి కొన్నాళ్లు వేచి ఉండాల్సిందే." అని అన్నాడు.

మొదటి టెస్టులో రోహిత్, జైస్వాల్ ఓపెనర్లుగా బరిలోకి దిగుతారని గంభీర్ తెలిపాడు. గిల్ నంబర్ 3లో, కోహ్లీ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడని చెప్పుకొచ్చాడు. మిడిలార్డర్‌లో రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ ఆడుతారని స్పష్టం చేశాడు. టీమ్ ఇండియా ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో బరిలోకి దిగే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నాడు. భారత్‌లో పిచ్‌లు గురించి చాలా మంది మాట్లాడుతున్నారని అన్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లేటప్పుడు రెండు రోజుల్లోనే టెస్టు మ్యాచులు ముగిశాయని, వాటి గురించి ఎవరూ మాట్లాడలేదని ఎద్దేవా చేశారు.

. ప్రస్తుతం జట్టులో ఉన్న చాలా మంది సీనియర్ ఆటగాళ్లతో తాను కలిసి ఆడానని, వారితో తనకు సంబంధాలు బాగున్నాయని తెలిపాడు. క్రికెటర్లు ఐపీఎల్ ఆడాలని మాత్రమే కోరుకుంటారని చాలా మంది ఆరోపిస్తుంటారు, అందులో నిజం లేదని చెప్పారు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నవారంతా దేశం కోసం ఆడాలని కోరుకుంటారని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ పై సిరీస్‌ను గెలవడమే తమ లక్ష్యమని చెప్పాడు.

అరుదైన ఘనతకు అడుగు దూరంలో టీమిండియా

బలగం టీవి, చెన్నై

1932, జూన్ 25న భారత క్రికెట్ చరిత్రలో మరుపురాని రోజు. భారత క్రికెట్ జట్టు తొలిసారిగా అంతర్జాతీయ క్రికెట్‌లో మైదానంలో అడుగుపెట్టింది. ఇప్పటికి 92 ఏళ్ల కాలం గడిచినా, టీమిండియా క్రికెట్ అభిమానుల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంది.

ఇప్పుడు, 2023 సెప్టెంబర్ 23న, ఈ చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది.చెన్నైలోని చిదంబరం స్టేడియంలో బంగ్లాదేశ్‌తో ఐదు రోజుల టెస్ట్ మ్యాచ్ జరగనుండగా, ఇది గెలిస్తే భారత్ క్రికెట్ చరిత్రలో ఓటముల కంటే విజయాలు ఎక్కువగా ఉన్న జట్టుగా అవతరించనుంది.

భారత క్రికెట్ జట్టు 1932లో అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రవేశించింది. మొదటి 20 ఏళ్ల కాలంలో ఏకైక విజయాన్ని 1952లో ఇంగ్లండ్‌పై సాధించింది, అది కూడా చెన్నైలోని చిదంబరం స్టేడియంలోనే కావడం గమనార్హం.

ఇప్పుడు, అదే స్టేడియం వేదికగా, భారత్ బంగ్లాదేశ్‌పై విజయం సాధిస్తే, క్రికెట్ చరిత్రలో అత్యధిక టెస్ట్ విజయాలు సాధించిన నాలుగో జట్టుగా నిలవనుంది. 1988 వరకు భారత జట్టు ఎన్నడూ ఎక్కువ విజయాలతో ఏదైనా సంవత్సరం ముగించలేదు. 2009లో 100వ టెస్ట్ విజయం సాధించడానికి టీమ్ 432 మ్యాచ్‌లు ఆడింది.అప్పటివరకు విజయశాతం 23.14 మాత్రమే ఉండగా, గత 15 ఏళ్లలో టీమ్‌ఇండియా 78 విజయాలను నమోదు చేసి విజయశాతాన్ని 53.06కి పెంచుకుంది.

92 ఏళ్ల తర్వాత సరికొత్త రికార్డు నెలకొల్పే అవకాశం

ప్రస్తుతం టీమ్‌ఇండియా 579 టెస్టులు ఆడగా, 178 విజయాలు, 178 ఓటములు, 222 డ్రాలు, ఒక మ్యాచ్ టైగా ముగిసింది. సెప్టెంబర్ 23న బంగ్లాదేశ్‌తో జరగనున్న తొలి టెస్ట్‌లో విజయం సాధిస్తే, భారత క్రికెట్ జట్టు చరిత్రలో కొత్త రికార్డు నెలకొల్పుతుంది.

ఇక భారత క్రికెట్ జట్టు సారథ్య బాధ్యతలు మొత్తం 36 మంది కెప్టెన్లు చేపట్టారు. మొదటి కెప్టెన్ సీకే నాయుడు నుంచి ప్రస్తుత కెప్టెన్ రోహిత్‌శర్మ వరకు, ప్రతి కెప్టెన్ జట్టుకు కీలక విజయాలను అందించారు. ఈ 92 ఏళ్ల ప్రయాణంలో మొత్తం 314 మంది క్రికెటర్లు భారత జట్టు తరపున టెస్ట్ మ్యాచ్‌లు ఆడారు.

ఇండియాతో మా అసలు సత్తా తెలుస్తుంది

- చెపాక్‌లో ఎప్పటి నుంచి బంతి టర్న్ అవుతుందో తెలియట్లేదు
- బంగ్లాదేశ్ ప్రధాన కోచ్ చందిక హతురసింఘూ

బలగం టీవి, చెన్నై

టీమిండియాతో ఆడితే తమ అసలు సత్తా తెలుస్తుందని బంగ్లాదేశ్ ప్రధాన కోచ్ చందిక హతురసింఘూ అన్నాడు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడం తమ జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని అన్నాడు. పరిస్థితులకు తగ్గట్లుగా ఆడితే మంచి ఫలితాలు వస్తాయని పాక్ పర్యటన నిరూపించిందని చెప్పాడు. తమ జట్టు సమతూకంగా ఉందని, స్పిన్, పేస్, బ్యాటింగ్‌లో సత్తాచాటే ఆటగాళ్లు ఉన్నారని తెలిపాడు. ఇక చెపాక్ వెకెట్ స్పోర్టింగ్ వికెట్‌లా కనిపిస్తుందని, కానీ ఎప్పటి నుంచి బంతి టర్న్ అవుతుందో అర్థం కావట్లదేని హతురసింఘూ అన్నాడు. "ఇది చూడటానికి ఈ స్థితిలో స్పోర్టింగ్ వికెట్‌లా కనిపిస్తుంది. కానీ ఉపఖండ పిచ్ పరిస్థితులతో పోలిస్తే తొలి రోజు నుంచి కూడా స్వభావం మారవచ్చు. ఎప్పటి నుంచి టర్న్ అవుతుందో తెలియదు" అని హతురసింఘూ పేర్కొన్నాడు. కాగా, ప్రపంచంలో అత్యుత్తమ జట్టు అయిన భారత్‌ను ఎదుర్కోవడం తమకు కఠినమైన సవాల్ అని బంగ్లా కోచ్ హతురసింఘూ అన్నాడు.

పంజాబ్ కింగ్స్ కోచ్‌గా పాంటింగ్

బలగం టీవి, చెన్నై

ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు వచ్చే సీజన్ కోసం మరోసారి హెచ్ కోచ్‌ను మార్చింది . ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌కు కోచ్‌గా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీంతో ఐపీఎల్ 2025 సీజన్‌లో అతడు పంజాబ్ జట్టుకు హెచ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు.ఢిల్లీ క్యాపిటల్స్‌కు పాంటింగ్ ఏడేళ్లు కోచ్ బాధ్యతలు నిర్వర్తించాడు. పాంటింగ్ హయాంలో ఢిల్లీ 2019, 2020, 2021 సీజన్లలో ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. అంతేగాక ఆ జట్టు తొలిసారి ఫైనల్స్‌కు చేరింది. 2020లో టైటిల్ పోరుకు వెళ్లిన ఢిల్లీ రన్నరప్‌గా నిలిచింది.

వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్తు రేసు మళ్లీ మొదలైంది. ప్రస్తుత డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో భారత్ నిలిచింది. ఇంకా భారత్ టాప్-4లో ఉన్న ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లతోనే భారత్ మిగతా మ్యాచ్‌లను ఆడనుంది. ఇండియా మరో పది టెస్టులు ఆడనుంది. అందులో బంగ్లాతో రెండు, కివీస్‌తో మూడు, ఆసీస్‌తో అయిదు టెస్టులు ఆడనుంది. అయితే డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకోవాలంటే భారత్ కనీసం అయిదు మ్యాచ్‌లు గెలవాల్సి ఉంది. అప్పుడే టీమిండియాకు మెరుగైన అవకాశాలుం టాయి. ఆరు విజయాలు సాధిస్తే దాదాపు ఫైనల్ చేరినట్లే. దాదాపు దశాబ్దం నుంచి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ విజయం కోసం ఎదురు చూస్తున్న ఆస్ట్రేలియాతో ప్రమాదం పొంచి ఉంది. కాబట్టి కంగారూ గడ్డపై అడుగుపెట్టకముందే ఫైనల్ బెర్తును రోహిత్ సేన ఖరారు చేసుకోవాల్సి ఉంది.